విజిలెన్స్ ఇన్‌చార్జి డీజీగా సీవీ ఆనంద్?

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): సీనియర్ ఐపీఎస్ అధికారి రాజీవ్ రతన్ అకాల మరణంతో ఖాళీగా ఉన్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ (డీజీ) పోస్టును భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. ప్రస్తుతం ఎన్నికల కోడ్ కొనసాగుతున్నందున ఆ పోస్టుకు ఇన్‌చార్జి అధికారిని నియమించనున్నట్టు సమాచారం. గతంలో ఈ పోస్టుకు ఏసీబీ డీజీ ఇన్‌చార్జిగా ఉండేవారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఏసీబీ డీజీగా పనిచేస్తున్న సీవీ ఆనంద్‌ను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి ఇన్‌చార్జిగా నియమించనున్నట్టు తెలుస్తున్నది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు త్వరలో వెలువనున్నట్టు సమాచారం. ఎన్నికల కోడ్ ముగిశాక పూర్తిస్థాయి డీజీని నియమించనున్నారు. డీజీపీ లేదా అడిషనల్ డీజీపీ ర్యాంకు అధికారిని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి డీజీగా నియమిస్తారు. ఇందుకోసం ప్రభుత్వం ముగ్గురు ఏడీజీల పేర్లను పరిశీలిస్తున్నట్టు సమాచారం. వీరిలో అగ్నిమాపకశాఖ డీజీ వై నాగిరెడ్డి, రైల్వేస్ అండ్ రోడ్ సేఫ్టీ డీజీ మహేశ్ భగవత్, తెలంగాణ స్పెషల్ పోలీస్ డీజీ స్వాతిలక్రా పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వీరితో పాటు మరో ఇద్దరు ఏడీజీల పేర్లు, వారి ట్రాక్ రికార్డుపై ప్రభుత్వం ఆరా తీస్తున్నట్టు తెలిసింది. విజిలెన్స్ డీజీగా రాజీవ్ రతన్ బాధ్యతలు చేపట్టగానే మేడిగడ్డ ప్రాజెక్టులో అధికారుల అవకతవకలపై లోతుగా విచారణ జరిపి ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదిక అందజేశారు. దీనితోపాటు సచివాలయంలో ఐటీ ప్రొక్యూర్‌మెంట్, నారాయణ పేట వైద్య కళాశాల నిర్మాణంలో జరిగిన అవకతవకలు, కంకర మిల్లుల నిబంధనల ఉల్లంఘన తదితర కేసులను రాజీవ్ రతన్ డీల్ చేశారు. అనతికాలంలోనే ఆ కేసులపై పట్టు సాధించారు. దీంతో ఆ స్థాయి లో నిబద్ధత కలిగిన, సమర్థుడైన అధికారిని విజిలెన్స్ డీజీగా నియమించేందుకు ప్రభుత్వం అన్వేషణ మొదలుపెట్టింది.

112 రోజుల్లో.. 50 ట్రాప్‌లు

- ఏసీబీ వలలో భారీ తిమింగళాలు
- 4 కేసుల్లో శిక్షలు.. మూడురోజులకొక ట్రాప్
- తెలంగాణలో ఏసీబీ దూకుడు
- లంచావతరాల భరతం పడుతున్న కొత్త బాస్ సీవీ ఆనంద్
- 24 గంటల అందుబాటులో ఏసీబీ కాల్‌సెంటర్

బర్త్ సర్టిఫికెట్ కావాలన్నా.. డెత్ సర్టిఫికెట్ కావాలన్నా.. పాస్ బుక్‌లు రావాలన్నా.. బిల్లులు చెల్లించాలన్నా.. లంచం లేనిదే పని జరగని రోజులు. తమ పనికావాలంటే పస్తులుండైనా సరే.. అధికారి అడిగినంత ఇవ్వాల్సిన దుస్థితి. దీంతో లంచావతారుల ఆగడాలను అరికట్టేందుకు.. అవినీతి నిరోధకశాఖ దూకుడు పెంచింది. సామాన్యులను పీడించేది ఎంతటి తోపు అధికారైనా సరే.. పక్కా ఆధారాలతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంటున్నది.

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ శాఖల్లో అవినీతికి అలవాటు పడి.. సామాన్యుల నుంచి బడా కాంట్రాక్టర్ల వరకూ ఎవ్వరినీ వదలకుండా లంచాల రూపంలో డబ్బులు దండుకుంటున్న జలగల భరతం పడుతున్నది రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ. 'ఫలానా అధికారి తమను లంచం కోసం వేధిస్తున్నాడు' అనే ఫిర్యాదు అందడమే అలస్యం.. పక్కా ప్రణాళికతో వారిని బంధిస్తున్నది. ఇటీవల ఏసీబీకి డీజీగా నియమితులైన సీవీ ఆనంద్ తనదైన మార్క్ చూపిస్తూ.. అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తున్నారు. లంచం తీసుకువాలంటేనే భయం పుట్టేలా తమ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వాలు ఎంతటి పటిష్ట చర్యలు తీసుకుంటున్నా.. అధికారుల్లో మార్పు రాకపోవడంతో తనదైన శైలితో, వినూత్న పంథాతో ఒక్కొక్కరికి ఒక్కో ఎర వేస్తున్నారు. గత డిసెంబర్ 27న ఏసీబీ డీజీగా బాధ్యతలు స్వీకరించిన సీవీ ఆనంద్.. 112 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 50 సార్లు ఎర వేసి పలువురు ప్రభుత్వ అధికారులను అరెస్టు చేయించారు. వీటిల్లో మూడు ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు ఉన్నాయి. మొత్తం 4 కేసుల్లో శిక్షలు సైతం పడ్డాయి.

అరెస్టులతో సరిపెట్టకుండా..

ఆయా ప్రభుత్వ విభాగాల్లోని ఏ అధికారైనా లంచం డిమాండ్ చేస్తే.. అందుకు తగ్గట్టుగా ఏసీబీ ట్రాప్‌ను సిద్ధం చేస్తున్నది. బాధితులు ఏసీబీకి సమాచారం ఇచ్చిన వెంటనే.. లంచం అడిగిన అధికారికి అనుమానం రాకుండా ఎరను సిద్ధం చేస్తున్నది. లిక్విడ్స్, నోట్లు, ఇతర ఆధారాలతో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంటూ ప్రభుత్వ అధికారుల వెన్నులో వణుకు పుట్టిస్తున్నది. కోర్టుకు సమర్పించేందుకు రహస్యంగా వీడియోలు సైతం తీస్తున్నది. దీంతో 'ఇంత సులువుగా ఎలా దొరికిపోయామా?' అని అధికారులే బోరున విలపిస్తున్నారు. అరెస్టులతో సరిపెట్టకుండా.. వెంటనే వారి ఆస్తులు, బినామీల వివరాలు ఆరా తీసి, వారి ఇండ్లలో సోదాలు చేపడుతున్నది. లంచావతారాలు అక్రమంగా సంపాదించిన డబ్బులు, బంగారం, భూములు, స్థిర, చరాస్తులను లెక్కకట్టి కోర్టుకు వివరిస్తున్నది. పక్కా ఆధారాలు సమర్పించడంతో కోర్టు సైతం శిక్షలు విధిస్తున్నది.

అవినీతి బండారం బయటపెడుతూ..

ఇటీవలి కాలంలో ఏసీబీ డీల్ చేసిన కేసుల్లో పెద్ద అవినీతి తిమింగలాలే ఉన్నాయి. హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ, అతని బినామీలైన కుటుంబసభ్యులు, ఇతర హెచ్ఎండీఏ అధికారుల అవినీతి బండారాన్ని ఏసీబీ బయటపెట్టింది. ఆ తర్వాత గిరిజన సంక్షేమ శాఖ ఇంచార్జి సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ) కే జగజ్యోతి ఇంట్లో వజ్ర వైఢ్యూర్యాలతో పాటు.. తీరొక్క నగలు, వడ్డాణాలు, బంగారు గొలుసులు, రత్నాలు పొదిగిన ఆభరణాలు.. మరెన్నో నగలను ఏసీబీ స్వాధీనం చేసుకుంది. సోషల్ మీడియాలో రీల్స్ చేస్తూ ప్రజాదరణ పొందిన ములుగు ప్రభుత్వ అధికారి తస్లీమా వంటి వారి లంచావతారాన్ని నిరభ్యంతరంగా బయటి ప్రపంచానికి బయల్పరిచింది. గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గొర్ల పంపిణీలో అక్రమాలకు పాల్పడిన పశు సంవర్ధశాఖ అధికారుల అవినీతి బాగోతాన్ని కూడా ఏసీబీ బయటపెట్టింది.

24 గంటల అందుబాటులో కాల్‌సెంటర్

తెలంగాణ అవినీతి నిరోధక శాఖ హెల్ప్ లైన్ నంబర్ 1064 సేవలు సైతం 24 గంటలు అందుబాటులో ఉండేలా ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ చర్యలు తీసుకున్నారు. ఏసీబీ హెల్ప్ డెస్క్ (కాల్ సెంటర్) కోసం ప్రత్యేకంగా గది, ఇతర సదుపాయాలు కల్పించి.. ప్రత్యేకంగా ఇద్దరు అదనపు సిబ్బందిని నియమించారు. సీవీ ఆనంద్ డీజీగా రాకముందు పనిదినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 వరకు మాత్రమే హెల్ప్ లైన్ సేవలు అందుబాటులో ఉండేవి. సీవీ ఆనంద్ రాకతో 24/7 హెల్ప్‌లైన్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఏసీబీ అవసరం ఉన్న ఫిర్యాదులను వెంటనే స్వీకరించి.. తక్షణ చర్యలు తీసుకుంటున్నారు. లంచం కోసం అధికారులు వేధిస్తే.. తమకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇకనైనా అధికారుల్లో మార్పు రావాలని.. ప్రభుత్వ ఆఫీసుల్లో 'ఇక్కడ లంచం తీసుకోబడదు' అనే బోర్డులు పెట్టించే దిశగా అడుగులు వేయాలని, ప్రభుత్వ పాలనను ప్రజలకు సక్రమంగా అందించాలని ఆయన కోరుతున్నారు.

ఒకేరోజు మూడు ఏసీబీ దాడులు

మొదటిపేజీ తరువాయి...

నల్లగొండ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సోమేశ్వర్ ఏసీబీకి పట్టుబడ్డాడు. చార్జి మెమో ఎత్తేసేందుకు ఆర్టీసీ డ్రైవర్ నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా హుజూరాబాద్ డిపో మేనేజర్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు

స్టేషన్ బెయిల్‌కు 40 వేల లంచం

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా బూరుగూడ సమీపంలో గతనెల 31న బైకును కారు ఢీకొట్టింది. ఈ కేసులో నిందితుడైన మంచిర్యాల జిల్లా సీసీసీ నస్పూర్‌కు చెందిన యాహిహోఖాన్‌కు స్టేషన్ బెయిల్ ఇవ్వడానికి, ప్రమాదానికి కారణమైన కారును విడుదల చేసేందుకు ఆసిఫాబాద్ ఎస్ఐ రాజ్యలక్ష్మి రూ.40 వేలు లంచం అడిగారు. చివరకు రూ.25 వేలకు ఒప్పందం చేసుకున్నారు. దాంతో యాహిహోఖాన్ ఏసీబీని సంప్రదించాడు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు నిందితుడి నుంచి రూ.25 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

ఫార్మసీ లైసెన్స్‌కు 18 వేలు డిమాండ్

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని కొత్తగూడెంలో నూకల వెంకట్‌రెడ్డి చారిటబుల్ ట్రస్టు పేరుతో దవాఖాన నిర్మించారు. దానికి అన్ని రకాల అనుమతులు రాగా ఫార్మసీ లైసెన్స్ కోసం గత నెల 26న ఆన్‌లైన్‌లో చిట్టపు సైదిరెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. కానీ, రెండు రకాల డాక్యుమెంట్స్, నిర్వాహకుడి సంతకాలు లేకపోవడంతో వాటిని రిజెక్టు చేశారు. ఈ నెల 8న కూడా దరఖాస్తు చేసుకొని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సోమేశ్వర్‌ను నేరుగా సంప్రదించారు. రూ.18 వేలు ఇస్తే అనుమతి ఇస్తానని సోమేశ్వర్ చెప్పడంతో చేసేది సేవా కార్యక్రమం, డబ్బులు ఇచ్చుకోలేనని బతిమాలినా వినకపోవడంతో సైదిరెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. సోమవారం కార్యాలయంలోనే సోమేశ్వర్ రూ.18 వేల నగదు తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ జగదీశ్ చంద్ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

ఆర్టీసీ డ్రైవర్ నుంచి కూడా లంచం

కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ ఆర్టీసీ డిపోలో ఎల్కతుర్తి మండలంలోని దండేపల్లికి చెందిన తాటికొండ రవీందర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఫిబ్రవరి 12న తన బంధువు చనిపోవడంతో రవీందర్ వెళ్లాడు. దీంతో డిపో మేనేజర్ శ్రీకాంత్ డ్రైవర్ రవీందర్‌కు ఆబ్సెంట్ వేశాడు. అనంతరం డ్రైవర్ రవీందర్ విధులకు వెళ్లగా.. మూడు రోజులు ఆబ్సెంట్ వేసి చార్జి మెమో ఇచ్చాడు. చార్జి మెమోను ఎత్తివేసేందుకు రూ. 30 వేలు ఇవ్వాలని డ్రైవర్‌ను మేనేజర్ డిమాండ్ చేశాడు. మొదటగా డ్రైవర్ రూ.10 వేలను లంచంగా ఇచ్చాడు. మిగతా రూ.20 వేలు ఇవ్వాలని డిపో మేనేజర్ డిమాండ్ చేస్తుండటంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. రూ.20 వేలను తీసుకునేందుకు ఎల్కతుర్తిలోని ఓ హోటల్‌కి డీఎం శ్రీకాంత్ రాగా, రవీందర్ డబ్బులను ఇస్తుండగా అక్కడే ఉన్న ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

సెల్ఫీ తీసుకుంటున్నారా.. వేలిముద్రలతో జాగ్రత్త!

నకిలీ వేలిముద్రలతో ఖాతాల లూటీ

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): చేతి వేళ్లు చూపిస్తూ స్మార్ట్ ఫోన్లతో సెల్ఫీలు దిగడం.. వాటిని స్టేటస్‌గా, డీపీలుగా పెట్టుకోవడం.. సోషల్ మీడియాలైనా ఇన్‌స్టాగ్రామ్‌లాంటి వాటిలో ఉంచడం పరిపాటిగా మారింది. ఇది చాలా ప్రమాదకరమైనదని సాంకేతిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఫొటోలోని చేతి వేళ్లతో సైబర్ నేరగాళ్లు నకిలీ వేలిముద్రలను తయారు చేస్తూ.. బ్యాంకు ఖాతాలు, సిమ్‌కార్డులు, సెల్‌ఫోన్లను హ్యాక్ చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ఇలాంటి సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉండటంతో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారని పేర్కొన్నారు.

• కాటేసిన పాముతో దవాఖానకు..

చంపి బాటిల్‌లో తెచ్చిన శాంతమ్మ, ధైర్యాన్ని మెచ్చుకున్న వైద్యులు, గ్రామస్థులు

వెంకటాపురం(నూగూరు), ఏప్రిల్15: పాము కాటుకు గురైన ఓ మహిళ.. ఆ పామును చంపి బాటిల్‌లో వేసుకుని చికిత్స కోసం ప్రభుత్వ దవాఖానకు వచ్చింది. ఈ ఘటన సోమవారం ములుగు జిల్లా వెంకటాపురం(నూగూరు) మండలం ముకునూరు పాలెంలో చోటుచేసుకొన్నది. గ్రామానికి చెందిన మిడియం శాంతమ్మ ఉపాధి హామీ పనులు చేస్తుండగా, పాము కాటుకు గురైంది. శాంతమ్మ ఆ పామును చంపి వాటర్ బాటిల్‌లో వేసుకొని స్థానిక ప్రభుత్వ దవాఖానకు వచ్చింది. వైద్యులకు కాటు వేసిన పామును చూపించి వైద్యం అందించాలని కోరింది. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉంది. కాగా, వైద్యులు, గ్రామస్థులు శాంతమ్మ ధైర్యాన్ని మెచ్చుకున్నారు.

• ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య

హసన్‌పర్తి, ఏప్రిల్ 15: ఉద్యోగం రాలేదని మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అర్వపల్లిలో సోమవారం చోటుచేసుకొన్నది. గ్రామానికి చెందిన ఆకుల రంజిత్(30) 2022 నుంచి మూడు సార్లు కానిస్టేబుల్, ఎస్సై పోస్టులకు దరఖాస్తు చేసి పరీక్ష రాసినా సెలెక్ట్ కాలేదు. ఈ ఏడాది ఫిబ్రవరిలో వచ్చిన ఫలితాల్లోనూ నిరాశే ఎదురైంది. ఉద్యోగం రాలేదని అప్పటి నుంచి కలత చెందుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో లుంగీతో ఉరేసుకున్నాడు. సమాచారం మేరకు 108 సిబ్బంది వచ్చి రంజిత్ మృతి చెందినట్టు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొన్నారు.

• ఏటీఎం బద్ధలు కొట్టి 19 లక్షలు చోరీ

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 15 : సీసీ కెమెరాలను ధ్వంసం చేసి ఏటీఎంలో డబ్బులు దోచుకుపోయిన సంఘటన శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకొన్నది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పాలమాకుల గ్రామంలోని ఎస్‌బీఐ ఏటీఎంలో సీఎంఎస్ కంపెనీకి చెందిన నగేశ్ ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో రూ.21 లక్షలను నింపాడు. అర్ధరాత్రి 1.59 నిమిషాలకు ఏటీఎంలో చోరీ జరిగినట్టు భద్రతను పర్యవేక్షిస్తున్న కాల్‌సెంటర్ నుంచి సమాచారం రాగా, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొన్నారు. ఏటీఎం నుంచి రూ.2,00,100ను విత్ డ్రా చేసినట్టు గుర్తించారు. మిగతా రూ.18,99,900ను దోచుకున్నట్టు నిర్ధారించారు. డబ్బులతో పాటు వీ- సెట్ మోడెన్ బాక్స్ దోపిడీకి గురైనట్టు పోలీసులు తెలిపారు. ఏటీఎంను డీసీపీ నారాయణరెడ్డి, ఏసీపీ శ్రీనివాస్‌రావు పరిశీలించారు. క్లూస్ టీమ్‌తో వివరాలు సేకరించాలని ఆదేశించారు.

• దేశ సమగ్రతను నాశనం చేయడమే బీజేపీ ఎజెండా

సాంస్కృతిక, సామాజిక విశ్లేషకురాలు దేవి విమర్శ

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): దేశ సమగ్రతను, ఆర్థిక వ్యవస్థను నాశనం చేయడమే బీజేపీ ఎజెండా అని ప్రముఖ సాంస్కృతిక, సామాజిక విశ్లేషకురాలు దేవి ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ చేస్తున్న భావోద్వేగ మత రాజకీయాలను ఓడిద్దామని పిలుపునిచ్చారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కన్వెన్షన్‌లో భాగంగా సోమవారం తొలి రోజు జరిగిన సదస్సులో 'భావోద్వేగ మత రాజకీయాలు' అనే అంశంపై ఆమె ప్రసంగించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. మోదీ నిజంగానే దేశాన్ని అభివృద్ధి చేస్తే ఇప్పటికీ చాలా మంది ప్రజలు అర్ధాకలితో ఎందుకు అలమటిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. మోదీ చర్యలన్నీ పురుషాధిక్యతకు అద్దం పడుతున్నాయని, అయోధ్యలో సీతాదేవి లేని రాముడి విగ్రహాన్ని ఏర్పాటు చేయడమే ఇందుకు నిదర్శనమని విమర్శించారు. అవినీతిని అంతం చేస్తానని చెప్పున్న మోదీ అధికారాన్ని అడ్డం పెట్టుకుని దేశంలోని భౌతికవాదులు, జర్నలిస్టులు, ప్రశ్నించే గొంతులను అణచివేస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు సత్యప్రసాద్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్ సానుభూతి తంత్రం

- పేద రైతు బిడ్డ సీఎంగా ఉండొద్దా? అంటూ దీనంగా వ్యాఖ్యలు
- గొడ్డలితో మీ చెట్టును నరికేస్తారట.. అంటూ రెచ్చగొట్టే మంత్రం
- ఎన్నికల కోడ్ లేకపోతే రుణమాఫీ చేసేవారమేనని బుకాయింపు
- ఆరు గ్యారెంటీల నుంచి తప్పించుకొనేందుకు ప్రయత్నం
- నారాయణపేట జనజాతరలో సీఎం రేవంత్‌రెడ్డి కొత్త భాషణం

నారాయణపేట సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతుండగా.. జనంలేక వెలవెలబోతున్న గ్యాలరీ

నారాయణపేట/హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): నాలుగు నెలలకే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత.. సర్వేలన్నీ కాంగ్రెస్ ఓడిపోతుందన్న సమాచారం.. చెప్పే మాటలు ప్రజలు నమ్మబోరని తెలిసిపాయే.. గ్యారెంటీలు కావవి, అంతా గిల్ట్ అని తేలిపాయే.. ఇక పార్టీ గట్టెక్కేది సానుభూతి జపంతోనేనని సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నారా? అంటే.. అవుననే అనుమానం కలుగుతున్నది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేటలో సోమవారం కాంగ్రెస్ నిర్వహించిన జనజాతర ఎన్నికల ప్రచార సభలో సీఎం రేవంత్ ప్రజల సానుభూతి పొందేందుకు విశ్వ ప్రయత్నం చేశారు. ఒకవైపు సానుభూతి జపం, మరోవైపు హామీల తంత్రంతో ఓటర్లకు గాలం వేయాలని చూశారు. పాలమూరు బిడ్డ సీఎం అయితే ఓర్వలేకపోతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి తన రాజకీయ ప్రత్యర్థులపై ఆరోపణలు గుప్పించారు. ఏం దొరల బిడ్డలే సీఎం కావాలా? పాలమూరు బిడ్డకు, ఒక పేద రైతు బిడ్డ సీఎం కాకూడదా? అని దీనంగా అడుగుతూ సానుభూతి పొందాలని చూశారు. 'పాలమూరు అభివృద్ధికి మనకు మనమే సంతకం చేయకూడదా?; ఇక్కడ సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలోనే మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ ఎంపీ సీట్లు గెలవకపోతే, అక్కడ ఢిల్లీలో నా ప్రతిష్ఠ పలుచన కాదా?; జిల్లాలో ఎలాగైనా రెండు సీట్లు గెలిపించి నా పరువు కాపాడాలి; నన్ను రాజకీయంగా బలహీన పరిచేందుకు గజ్వేల్ ఫాంహౌజ్ నుంచి కేసీఆర్, ఢిల్లీలో ప్రధాని మోదీ గొడ్డలి పట్టుకొని మీరు నాటిన చెట్టును నరకటానికి తిరుగుతున్నారు' అంటూ ప్రజల్లో స్థానిక సెంటిమెంట్‌ను, భావోద్వేగాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. కాంగ్రెస్‌ను ఓడించటానికి బీఆర్ఎస్-బీజేపీ చేతులు కలిపాయని ఆరోపించారు. ఐదు సీట్లలో బీజేపీని గెలిపించేందుకు బీఆర్ఎస్ సుపారీ తీసుకొన్నదని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన రెండు నెలల్లోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని, ఎంపీ ఎన్నికల్లో బాగా పనిచేసిన వారికే పదవులు వస్తాయంటూ ద్వితీయ శ్రేణి నాయకులకు గాలం వేశారు. ముదిరాజ్, యాదవ, రజకులకు పెద్ద పీట వేస్తామంటూ ఆ వర్గాలను ఆకట్టుకొనే ప్రయత్నం చేశారు. పాలమూరు ఎంపీ నియోజకవర్గంలో గెలుపు ఓటములను ప్రభావితం చేసేలా ఉన్న ముదిరాజ్ ఓటర్లకు గాలం వేసేందుకు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి ఆగస్టు 15 కల్లా మంత్రి పదవి ఇస్తామని ప్రకటించటం గమనార్హం.

డీకే అరుణ.. ఒళ్లంతా దొరసానే: వంశీచందర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం నుంచి బీజేపీ తరపున పోటీచేస్తున్న డీకే అరుణ మామూలు దొరసాని కాదని, ఒళ్లంతా దొరసానేనని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ వంశీచందర్ రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బడుగు, బలహీనవర్గాల దొరసాని అని, ముదిరాజ్, యాదవ, కురుమ కులాల పాలిట దొరసాని అని, గద్వాల బంగ్లా రాజకీయాలు చేసే దొరసాని అని అన్నారు.

జనం లేని జనజాతర

నారాయణపేటలో నిర్వహించిన కాంగ్రెస్ జనజాతర సభ జనం లేకుండానే కొనసాగింది. సభకు హాజరైన జనం కూర్చునేందుకు వేసిన కుర్చీలు సగం ఖాళీగానే దర్శనమిచ్చాయి. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతుండగానే కొందరు సభా ప్రాంగణం నుంచి బయటకు వెళ్లిపోయారు.

సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు

రేవంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నేతలు కాంగ్రెస్‌లో చేరారు. వీరిలో బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, నిర్మల్ మున్సిపల్ చైర్మన్ జీ ఈశ్వర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు రాజ్ మహమ్మద్, రవీందర్‌రెడ్డి ఉన్నారు.

ఆగస్టు 15 నాటికి రైతు రుణమాఫీ: సీఎం రేవంత్

ఆగస్టు 15 నాటికి రాష్ట్రంలోని 69 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల రుణమాఫీని ఏకకాలంలో మాఫీ చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. రూ.22,500 కోట్లతో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని తెలిపారు. కులగణన చేపట్టి తీరుతామని, వడ్లకు రూ.500 బోనస్ ఇచ్చి ప్రతి చివరి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. గ్రామీణ స్థాయి లో ఇందిరమ్మ కమిటీలను వేస్తామని తెలిపారు.

ఠాణాలో కాంగ్రెస్ నేత డ్యాన్స్

- సినిమా పాటకు చిందులు
- సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తూ వంత పాడిన కానిస్టేబుల్

మహదేవపూర్/భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 15: అది రక్షకభట నిలయం. బాధితులకు భరోసా కేంద్రం. ఎంతో మంది తమ గోడును పోలీసులకు చెప్పుకోడానికి వస్తుంటారు. కానీ, ఆ పోలీస్‌స్టేషన్ ఓ కాంగ్రెస్ నాయకుడికి డ్యాన్స్ క్లబ్‌లా మారింది. వీధిలో రికార్డింగ్ డ్యాన్స్ చేసినట్టు ఏకంగా పోలీస్‌స్టేషన్‌లోనే సినిమా పాటలు పెట్టుకొని చిందులేశాడు. వారించాల్సిన పోలీస్ సిబ్బంది కూడా అతడికే వంతపాడారు. రన్నింగ్ కామెంటరీ చేస్తూ.. సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఈ ఘటన జరిగింది. ఈ వీడియో సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో పోలీస్‌శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించారు. ఘటనపై విచారణ జరిపారు. నిర్లక్ష్యం నిజమని తేలడంతో హెడ్ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేయడంతోపాటు ఎస్‌హెచ్‌వోను వెకెన్సీ రిజర్వు (వీఆర్)కు, ఇతర సిబ్బందిని వివిధ స్టేషన్లకు బదిలీ చేశారు. మహదేవపూర్ కాంగ్రెస్ జడ్పీటీసీ సభ్యురాలు గుడాల అరుణ భర్త గుడాల శ్రీనివాస్ సోమవారం వాకింగ్‌కు వెళ్లి తిరిగి వస్తూ మార్గమధ్యంలోని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అక్కడ రిసెప్షన్‌లో ఉన్న పోలీసులను పలకరించాడు. ఇటీవల శ్రీనివాస్ డ్యాన్స్ చేసిన పలు ఘటనలు ఉదహరిస్తూ అక్కడున్న కానిస్టేబుల్ ప్రశంసించారు. దీంతో హీరో నాగార్జున నటించిన 'నేనున్నాను' చిత్రంలోని 'నన్నేలు మన్మథుడా' అనే పాటకు చిందులేస్తూ స్టెప్పు లేశాడు. దీనిని అడ్డుకోవాల్సిన అక్కడే ఉన్న పోలీసు డ్యాన్స్‌ను చిత్రీకరిస్తూ వంత పాడాడు.



పోలీస్‌స్టేషన్‌లో డ్యాన్స్ చేస్తున్న శ్రీనివాస్

• 'భద్రాచలం-సారపాక' రెండో వారధి ప్రారంభం



భద్రాచలం-సారపాకను కలుపుతూ నిర్మించిన రెండో వారధి ప్రారంభోత్సవం సందర్భంగా పూజలు చేస్తున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల. చిత్రంలో ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, ఎన్‌హెచ్ ఈఈ యుగంధర్, డీఈ శైలజ, ఏఎస్పీ పరితోశ్ పంకజ్ తదితరులు

• లాసెట్ దరఖాస్తుల గడువు 25కి పెంపు

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ) : టీఎస్ లాసెట్, పీజీలాసెట్ దరఖాస్తుల గడువును ఈ నెల 25 వరకు పొడిగించారు. అభ్యర్థులు త్వరగా దరఖాస్తు చేసుకోవాలని సెట్ కన్వీనర్ బీ విజయలక్ష్మి సూచించారు.

• 21న టీఎస్‌ఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ) : టీఎస్‌ఆర్‌జేసీ ప్రవేశ పరీక్షను ఈ నెల 21న నిర్వహించనున్నట్టు గురుకులాల సెక్రటరీ రమణకుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 : 30 గంటల వరకు ఈ పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. మొత్తం 73,527 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, వీరి హాల్‌టికెట్లను సోమవారం విడుదల చేసినట్టు తెలిపారు.

• ఇంటర్ అడ్మిషన్ డ్రైవ్‌ను చేపట్టాలి

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్ల సంఖ్యను పెంచేందుకు 'అడ్మిషన్ డ్రైవ్'ను చేపట్టాలని అధ్యాపక సంఘం నేతలు కోరారు. ఈ మేరకు ఇంటర్‌బోర్డు సెక్రటరీ శృతిఓజాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇంటర్ మూల్యాంకన రెమ్యూనరేషన్‌ను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘం నేతలు వీ శ్రీనివాస్, సురేశ్, శ్రీనివాస్‌రెడ్డి, సంగీత, విశాలాక్షి తదితరులు ఉన్నారు.

• ఒక్కసారే టెట్ దరఖాస్తుల సవరణ

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ) : టెట్ దరఖాస్తుల్లో దొర్లిన తప్పులను ఒక్కసారే సవరించుకొనే అవకాశం ఉన్నది. 20 వరకు దరఖాస్తులను సవరించుకోవచ్చు. తప్పులను మరోసారి సవరించుకొనే అవకాశం లేదు. కావున, జాగ్రత్తగా దరఖాస్తులను ఎడిట్ చేయాలని అధికారులు సూచించారు.

• రాములోరి కల్యాణం లైవ్ వద్దు

రాష్ట్ర దేవాదాయ శాఖకు కేంద్ర ఎన్నికల సంఘం లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 15(నమస్తే తెలంగాణ) : శ్రీరామనవమి సందర్భంగా ఈ నెల 17న భద్రాచలంలో నిర్వహించే సీతారామచంద్ర స్వామి కల్యాణ మహోత్సవాన్ని ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు కేంద్రం ఎన్నికల సంఘం నిరాకరించింది. ఈ మేరకు రాష్ట్ర దేవాదాయ శాఖ విజ్ఞప్తిని తిరస్కరిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఈ నెల 4న లేఖ రాసింది. ఈ నేపథ్యంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తమ నిర్ణయాన్ని పున:పరిశీలించాలని కోరుతూ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సోమవారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి లేఖ రాశారు.

ఇంటి వద్దకే రాములోరి తలంబ్రాలు : సజ్జనార్

భద్రాచలం రాములోరి తలంబ్రాలను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకొనే సదుపాయాన్ని టీఎస్ ఆర్టీసీ కల్పించింది. భక్తులు http://tsrtclogistics.in వెబ్‌సైట్‌ను సంప్రదించి.. తలంబ్రాలను ఆర్టీసీ ద్వారా ఇంటి దగ్గర పొందవచ్చని సంస్థ ఎండీ సజ్జనార్ సోమవారం ట్విట్టర్ ద్వారా తెలిపారు. ఆఫ్‌లైన్‌లో కూడా తలంబ్రాలను పొందేందుకు 040-23450033, 040-69440000, 040-69440069 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

• స్థానిక ఎన్నికల్లో బీసీలకు 50% కోటా ఇవ్వాలి

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): బీసీల కులగణన చేపట్టి, పంచాయతీరాజ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ పదవుల్లో బీసీ రిజర్వేషన్లు 50 శాతానికి పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ లేశారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 22% నుంచి 42 శాతానికి పెంచుతామని ప్రకటించిందని గుర్తుచేశారు.

• ఇందిరమ్మ రాజ్యమంటే వెన్నుపోటా? : కిషన్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ 400కుపైగా హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడవడమే ఇందిరమ్మ రాజ్యమా? అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలనే డిమాండ్‌తో సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో 'రైతు దీక్ష'లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 2 లక్షలలోపు రైతు రుణాలను మాఫీ చేయాలని, రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేలు, రైతు కూలీలకు రూ.12 వేలు, వరికి క్వింటాలుకు రూ. 500 చొప్పున బోనస్ వంటి హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

• 'ఎన్నికల్లో సమన్వయంతో పనిచేద్దాం'

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): సార్వత్రిక ఎన్నికలను పారదర్శకంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా నిర్వహించాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నిర్ణయించాయి.సోమవారం సచివాలయంలో తెలంగాణ, ఏపీ అధికారుల సమన్వయ సమావేశం జరిగింది. దీనికి తెలంగాణ, ఏపీ సీఎస్‌లు శాంతికుమారి, జవహర్ రెడ్డి తదితరులు పలు అంశాలపై చర్చించారు.



శాంతి 70 ఎ/సి - నారాయణగూడ 11.00,2.00,6.00,9.00

PVR ఆర్.కె - బంజారాహిల్స్ 4.50PM	INOX ఎం.పి.మాల్ - కాచిగూడ 1.40PM
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 4.15PM	INOX సత్వనెక్లిస్ మాల్ - కవాడిగూడ 4.30PM
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్ 1.55PM	INOX అశోక ఎ/సి - వై.జంక్షన్ 1.35PM
PVR నెక్సస్ మాల్ - కూకట్‌పల్లి 11.00PM	మిరాజ్ సినిమాస్ - దిల్‌సుఖ్‌నగర్ 5.20PM
PVR గలేరియా - పంజాగుట్ట 1.25PM	మిరాజ్ సినిమాస్ - ఐడిపిఎల్ 5.20PM
PVR పివిఆర్ - ఎర్రమంజిల్ 1.35PM	మిరాజ్ సినిమాస్ - చందానగర్ 2.40PM
PVR పివిఆర్ - మూసారంబాగ్ 1.55PM	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి 4.40PM
PVR ప్రెస్టీన్ ప్రైమ్ - గచ్చిబౌలి 4.30PM	లక్ష్మీనరసింహ - మియాపూర్ 4.40PM
PVR ఐకాన్ - హైటెక్ సిటీ 4.15PM	AMR ఎఎంఆర్ - మౌలాలి 11.30AM
PVR ATRIUM మాల్ -గచ్చిబౌలి 4.15PM	AMB ఎఎంబి - గచ్చిబౌలి 4.25PM
PVR ఎస్2 ఎ/సి - మల్లాపూర్ 4.30PM	GP జిపిఆర్ - కూకట్‌పల్లి 10.15AM
INOX ఐనాక్స్ - బంజారాహిల్స్ 10.40PM	సినీమార్ట్ - ఆర్.సి.పురం 4.40PM
INOX జి.ఎస్.ఎమ్ - మదీనాగూడ 5.00PM	GLOBAL CINEMAS LLP